క్లుప్తంగా

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

వి.కోట: ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదివారం వి.కోట మండలంలో పర్యటించనున్నారని ఎంపీపీ యువరాజు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణాపురం, గోనుమాకులపల్లి, కుంబార్లపల్లి, ఓగు.బీసీపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే పాముగానిపల్లిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, ఎస్.బండపల్లి, బోడిగుట్లపల్లి, నెరిన్నపల్లిలో జీజీఎంపీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ



ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి

పెద్దపంజాణి: స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం జెడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి తనిఖీ చేశారు. రికార్డుల గదిలో చెదలు పట్టిన రికార్డులను పరిశీలించారు. వాటి వివరాలను జెడ్పీ కార్యాలయానికి పంపి జాగ్రత్తగా భద్రపరచాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీపీ ఎన్.రెడ్డెప్ప, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీవో నాగరాజ

సోమల: మండలంలోని నెల్లిమంద, 81– చిన్న ఉప్పరపల్లె పంచాయతీల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నాగరాజ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి వివరించారు. వైస్ ఎంపీపీ సయ్యద్ బాషా, సర్పంచులు చంద్రకళ, సిద్దులమ్మ, ఎంపీటీసీ సరస్వతమ్మ, ఉప సర్పంచ్ రెడ్డెమ్మ, ఏపీవో దినకర్‌బాబు, ఈవో పీఆర్డీ లక్ష్మిదేవి, ఏవో సుధాకర్ పాల్గొన్నారు.

గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

రొంపిచెర్ల: స్థానిక పీహెచ్‌సీలో శనివారం గర్భిణులకు ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకం కింద ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించినట్టు డాక్టర్ దినేష్ కుమార్‌నాయక్ తెలిపారు. గర్భిణులకు గుండె, బీపీ, షుగర్, ఉదర, రక్త పరీక్షలు చేసి మందులకు పంపిణీ చేశామన్నారు. తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాన్ని వినియోగించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీలు గీతాశ్రీ, భారతి, ఆరోగ్య కార్యకర్తలు గాయత్రి, వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

11న కార్తీక దీపారాధన



కోనేటి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న త్రిమూర్తి, పరమేష్

పుంగనూరు: పట్టణంలోని అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ పుష్కరిణిలో సోమవారం రాత్రి ఆధ్వర్యంలో కార్తీక దీపారాధన నిర్వహించనున్నట్టు హిందూ జాగరణ సమితి ప్రతినిధులు త్రిమూర్తిరెడ్డి, పరమేష్ తెలిపారు. వారు శనివారం సాయంత్రం పుష్కరణి మెట్లను నీటితో శుభ్రం చేసి, పసుపు, కుంకుమ పెట్టే ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో జాగరణ సమితి ప్రతినిధులు గంగాధర్, హరి, నాగరాజ, సురేష్, వెంకటేష్, చంద్ర, సునీల్, రాజేష్, మధు, భార్గవ్ పాల్గొన్నారు.

జ్వరం, జలుబుతో ఓపీ కిటకిట



ఆస్పత్రిలో క్యూ కట్టిన జ్వర బాధితులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం జ్వరం, జలుబు, దగ్గు బాధితులతో ఓపీ కిటకిటలాడింది. ఈ రకమైన సమస్యలకు సంబంధించి 150కి బాధితులు వచ్చారు. దీంతో ఆస్పత్రి ఆవరణ మధ్యాహ్నం 12 గంటల వరకు రద్దీగా కనిపించింది. వైద్యులు చికిత్స చేసి తగిన సూచనలు, సలహాలు అందించారు. వైరల్ ఫీవర్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించారు. వైద్యులు మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

ఎనిమిది మసీదులకు పట్టాలు



మసీదులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లిం మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించి ఆదుకున్నారని, నేడు ఆయన తనయుడు సీఎం జగనన్న ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. స్థానిక మర్కజ్‌లో శనివారం గంటావూరు తఖ్వా, వైఎస్సార్ నగర్ అబూబకర్, ఉస్మాన్‌బిన్‌రబ్బా, బిలాల్‌బిన్ రబ్బా మసీదులు, మసిద్–ఏ– అయిషా మదరసా, ఇందిరమ్మ కాలనీలో శ్మశానం, ఈద్గా, గడ్డూరు కాలనీలో నూర్ మసీదులకు శనివారం పట్టాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో మసీదులకు హక్కులు కల్పించాలని పలుమార్లు అధికారులు, నాయకులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఈ విషయం తన దృష్టికి రాగానే సీఎంను కలిసి సమస్యను విన్నవించానన్నారు. ఆయనిచ్చిన హామీతోనే ఫైల్ కలెక్టర్ నుంచి స్థానిక రెవెన్యూ అధికారులకు వచ్చి సమస్య పరిష్కారమైందన్నారు. ఈ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పదవిని మైనారిటీకి ఇచ్చారని, దీన్ని బట్టి ముస్లింలపై ఉన్న చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చన్నారు. గత టీడీపీ పాలనలో పట్టణంలోని ఆస్పత్రికి రూ.20 లక్షలు ఖర్చుబెట్టి భారీగా ప్రచారం చేసుకున్నారని, నేటి జగనన్న పాలనలో రూ.16 కోట్లు వెచ్చించి సర్వాంగ సుందరంగా నిర్మించినా పెద్దగా ప్రచారం చేసుకోలేదన్నారు. తమది చేతల ప్రభుత్వమే గానీ మాటల ప్రభుత్వం కాదని వివరించారు. ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం ఇంతగా కృషి చేస్తున్న జగనన్నను మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం మీపై ఉందన్నారు. అనంతరం మర్కజ్ పెద్దలు జాఫర్, ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ముస్లింలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మైనారిటీ నేతలు బీడీ మస్తాన్, శ్యామ్, హైదర్, మజ్జు, మున్నా, రంజిత్, ఫిరోజ్, హయాత్, ఫయాజ్, జమాత్ పెద్దలు పాల్గొన్నారు.

సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్

- రూ.1.37 కోట్ల పరిహారం పంపిణీ
- సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవరావు



మాట్లాడుతున్న జడ్జి వాసుదేవరావు, జడ్జి సింధు

పుంగనూరు: సత్వర న్యాయం, మైత్రి బంధాలకు వేదికగా మారుతున్న లోక్ అదాలత్‌లను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవరావు పిలుపునిచ్చారు. కోర్టు ఆవరణలో శనివారం అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి సింధుతో కలిసి లోక్‌అదాలత్ నిర్వహించారు. ఇందులో 564 కేసులను పరిష్కరించి రూ.1.37 కోట్ల పరిహారం పంపిణీ చేశారు. న్యాయమూర్తి మాట్లాడుతూ మంచి మాటలతో ఎంతటి సున్నిత సమస్యనైనా పరిష్కరించుకోవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మైత్రి బంధాలను బలపరుచుకోవాలని, కక్షలతో సాధించేది ఏమీ ఉండదని తెలిపారు. ముందుగా ఎదురయ్యే సమస్యలతో పాటు పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకుంటే కోర్టు ఫీజులు వాపసు ఇస్తామన్నారు. లోక్‌అదాలత్ తీర్పులపై ఎలాంటి అప్పీల్ లేదని, తుది తీర్పు లోక్‌అదాలత్ లదేనని వివరించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గల్లా శివశంకర్‌నాయుడు, న్యాయవాదులు వెంకటముని యాదవ్, బాలాజీకుమార్, ఆనందకుమార్, కిరణ్, విజయకృష్ణ, వరుణ్‌కుమార్, మున్ని, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 645 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌లో పాల్గొన్న జడ్జీలు, న్యాయవాదులు

కుప్పం రూరల్ : స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 645 కేసులను పరిష్కరించినట్లు జడ్జీలు ఆరీఫాషేక్, భారతి తెలిపారు. వాటిలో 617 క్రిమినల్, 28 సివిల్ కేసులు ఉన్నట్టు చెప్పారు. రూ.5.20,90,288 పరిహారం అందజేసినట్టు తెలిపారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించుకోవాలని సూచించారు.

రాజీ అంటే ఇరుపార్టీలు గెలిచినట్టే





మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు, రాజీ పత్రాలు అందజేస్తున్న న్యాయమూర్తులు

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు
- లోక్ అదాలత్‌లో 450 కేసుల పరిష్కారం

పలమనేరు: కేసుల్లో రాజీకి పోవడం అంటే ఒకరు గెలిచి, మరొకరు ఓడినట్టు కాదని, ఇరువురూ గెలిచినట్టేనని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్ కేసులను పరిష్కరించారు. ఆయన మాట్లాడుతూ త్వరితగతిన కేసుల పరిష్కారం కోసం అత్యున్నత న్యాయస్థానం రాజీమార్గాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఇది కక్షిదారులకు ఎంతో ఉపయుక్తంగా మారిందన్నారు. కేసుల రాజీతో కక్షిదారుల కుటుంబాల్లో వెలుగులు విరజిమ్ముతాయని చెప్పారు. పలమనేరులో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో రూ.76.69 లక్షల విలువైన 450 కేసులు పరిష్కారమైనట్టు తెలిపారు.

ప్రారంభానికి సిద్ధంగా షాదీమహల్



రొంపిచెర్లలో నిర్మించిన షాదీమహల్

రొంపిచెర్ల: మండల కేంద్రమైన రొంపిచెర్లలో నిర్మించిన షాదీ మహల్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. టీడీపీ హయాంలో రూ.7 లక్షలతో షాదీమహల్‌ను నిర్మించారు. దాన్ని వినియోగం లోకి తీసుకురాకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక సర్పంచ్ ఇబ్రహీంఖాన్ ముస్లింలు వివాహాలు చేసుకుందుకు షాదీ మహల్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ప్రభుత్వం నుంచి రూ.2.20 కోట్ల నిధులు మంజూరు చేయించారు. అధికారులు టెండర్లు నిర్వహించి పనులు పూర్తి చేశారు. షాదీ మహల్‌ను అధునాతనంగా నిర్మించారు. ఈ క్రమంలో మంత్రి చేతుల మీదుగా సోమవారం ప్రారంభించనున్నారు.

శ్రీవారి మెట్టు వద్ద ఘనంగా కార్తీక వనభోజనాలు



విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: పవిత్ర కార్తీకమాసం సందర్భంగా శనివారం శ్రీవారి మెట్టు వద్ద గల పార్వేట మండపంలో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని టీటీడీ అధికారులు వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 7 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవర్లను ఊరేగింపుగా పార్వేట మండపానికి తీసుకొచ్చారు. స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని అర్చకులు వైఖానస ఆగమోక్తంగా నిర్వహించారు. అనంతరం పార్వేట మండపంలో మధ్యాహ్నం 12 నుండి 3 గంటల వరకు కార్తీక వనభోజనోత్సవం జరిగింది. కార్తీక వనభోజనం మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నారాయణాచార్యులు, ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఆలయ ప్రత్యేక అధికారి, టీటీడీ పీఆర్‌ఓ డాక్టర్ టి.రవి, వీజీవో బాలిరెడ్డి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్లు చెంగల్‌రాయులు, వెంకట స్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న కళాశాల యాజమాన్యం

కుప్పం: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పద్మశ్రీ, చంద్రయాన్–2, మంగళయాన్ ప్రాజెక్టుకు డైరెక్టర్గా పనిచేసిన మైల్‌స్వామి అన్నాదొరై తెలిపారు. ఆయన శనివారం కుప్పం ఇంజినీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డేలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఓటమికి భయపడకుండా ధైర్యంగా ముందుకుసాగాలని సూచించారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించినప్పుడే జీవితం సంతృప్తికరంగా సాగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో బీసీఎన్ విద్యాసంస్థల చైర్మన్ బీసీ నాగరాజు, వైస్ చైర్మన్ సునీల్‌రాజ్ పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో జెడ్పీ చైర్మన్



జెడ్పీ చైర్మన్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం ఆయన కాణిపాకం విచ్చేయగా ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో..

చిత్తూరు కార్పొరేషన్: తిరుమలలోని శ్రీవారిని శనివారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వేద పండితులు స్వామి దర్శనభాగ్యం కల్పించి ఆశ్వీరచనాలు అందించారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కంటి జబ్బు రోగులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి చెన్నై శంకర్‌నేత్రాలయ ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కంటి జబ్బు రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యతోనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్



భార్గవరెడ్డిని సన్మానిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు రూరల్: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డీఈఓ విజయేంద్రరావు అన్నారు. చిత్తూరు నగరం రెవెన్యూ భవనంలో శనివారం ప్రజాహిత సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభకు పట్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి యూనివర్సిటీ టాపర్‌గా నిలిచి రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్న భార్గవ్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కాళ్లు చేతులు కదపకుండా 5 గంటల పాటు నీటిలో తేలియాడి గిన్నిస్ రికార్డులోకెక్కిన వైషాక్, రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకున్న నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం అధ్యక్షురాలు కరణం విమలను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పట్టుదల ఉంటే సాధించలేనిది లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సెల్వరాజ్, సంస్థ అధ్యక్షుడు రాజరత్నంరెడ్డి, దాత పార్థసారధినాయుడు పాల్గొన్నారు.

16న పలమనేరులో సామాజిక సాధికార బస్సుయాత్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్

పలమనేరు: పట్టణంలో ఈ నెల 16న వైఎస్సార్ సీపీ సామాజిక, సాధికార బస్సు యాత్ర నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే వెంకటేగౌడ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. వారు శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ఈ నెల 14న మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారని, ఈ క్రమంలో 16న బస్సుయాత్ర చేపట్టాలని నిర్ణయించినట్టు చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా బడుగు, బలహీనవర్గాల వారి సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. బీసీ కులాల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేసినట్టు వివరించారు. 16న గంగవరం ఫ్లైఓవర్ నుంచి బస్సుయాత్ర ప్రారంభమై పట్టణంలోని ఏటీఎం సర్కిల్ దాకా జరుగుతుందన్నారు. అనంతరం టవర్ క్లాక్ వద్ద భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్టు తెలిపారు. బెయిల్‌పై వచ్చిన చంద్రబాబు కోర్టు ఆదేశాలను భేఖాతరు చేస్తూ తన కేసుకు సంబంధించిన విషయాలపై ప్రజలతో మాట్లాడుతున్నారని విమర్శించారు. గతంలో ఎన్నికల సందర్భంగా ఉత్తుత్తి ఏటీఎం కార్డులను ఇచ్చి ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లోనూ లేనిపోని హామీలను గుప్పించినా జనం నమ్మరన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న జగనన్నను జనం మరో దఫా ఆశీర్వదించడం ఖాయమన్నారు. రాష్ట్ర పార్టీ కార్యదర్శులు బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, రంగనాథం, శ్రీరాములు రెడ్డి, మండల కన్వీనర్లు బాలాజీనాయుడు, బాగారెడ్డి, పెద్దపంజాణి ఎంపీపీ రెడ్డెప్ప, వైస్ ఎంపీపీ జీడీబాబు, మాజీ కన్వీనర్ మండీసుధ, నాయకులు రహీంఖాన్, కోదండ రామయ్య, రాజారెడ్డి, గిరిరాజారెడ్డి, రవి, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రమౌళి ఆశయాన్ని నెరవేరుద్దాం



నడింపల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్సీ భరత్ తల్లి పద్మజ

శాంతిపురం: దివంగత చంద్రమౌళి ఆశయాన్ని నెరవేర్చేందుకు అందరూ కలిసి రావాలని ఆయన సతీమణి పద్మజ కోరారు. ఆమె శనివారం నడింపల్లి పంచాయతీలో పర్యటించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. తన భర్త నిర్ణయం మేరకు కొడుకు భరత్ కుప్పంలో పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచాడని చెప్పారు. చంద్రమౌళి ఆస్పత్రిలో పడకపై ఉన్నా ఎంతో నమ్మకంతో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి టికెట్ ఇచ్చారని గుర్తు చేశారు. పార్టీ కార్యకర్తలు, చంద్రమౌళి అభిమానులు సమష్టిగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. భరత్‌ను ఎమ్మెల్యేగా చేయడమే చంద్రమౌళికి నిజమైన నివాళి అవుతుందన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దుర్గ

కుప్పం: సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల పథకాలతో మహిళలను మహరాణులను చేసి మహిళా పక్షపాతిగా పేరు పొందారని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ తెలిపారు. ఆమె శనివారం కుప్పం మున్సిపాలిటీలోని 19 వార్డులో జగనన్నతో జనం భరత్ అన్నతో మనం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ వార్డులోని మర్రిమాను వీధి, ప్యాలెస్ ఎక్స్‌టెన్షన్‌లో మహిళలకు పసుపు, కుంకుమ, చీరలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ దేశ చరిత్రలోనే పాలనా వ్యవస్థలో అనేక మార్పులు తీసుకువచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కుప్పం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తున్న తన భర్త భరత్‌ను ఆశీర్వదించాలని కోరారు.

పిల్లలకు నైతిక విలువలు నేర్పాలి



బహుమతులందుకున్న చిన్నారులతో నిర్వాహకులు



వార్షికోత్సవ పురస్కారాల గ్రహీతలతో నిర్వాహకులు

పలమనేరు: పిల్లలకు విద్యతో పాటు నైతిక విలువలు నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని శతావధాని ఆముదాల మురళి తెలిపారు. స్థానిక కళామందిరంలో శనివారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి పదకొండో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విలువలను నేర్పే నీతి పద్యాలను పిల్లలతో కంఠస్థం చేయించాలన్నారు. గార్లపాటి దామోదర్‌నాయుడు మాట్లాడుతూ తెలుగు కోసం దశాబ్దకాలంగా కృషిచేస్తున్న తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి సేవలను కొనియాడారు. అనంతరం భాషా పోటీల్లో గెలుపొందిన 60 మంది పిల్లలకు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు తులసీనాథం నాయుడు, పుష్ప పుస్తకాలు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం వార్షికోత్సవ పురష్కారాలను బ్రహ్మానందరెడ్డి, రఘుపతి రామస్వామి, మునిరెడ్డి, కీర్తి, మురళీధరరాజు, నగేష్, కవిత, మధుమోహన్, ఆనంద్‌నాయుడు, మొగిలయ్యశెట్టి, రెడ్డెమ్మ, వేలాయుధంకు అందజేశారు. కార్యక్రమంలో జింకా లక్ష్మీనారాయణ, ఎంఈవో వేణుగోపాల్ రెడ్డి, ధనుంజయ, రజని, శివశంకర్, సుదర్శనాచారి, గురుమూర్తి, మేనక, గాలి గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి



మానవహారం నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళలు

పాలసముద్రం: బాల్యవివాహాలను అరికట్టాలని ఐకేపీ ఏపీఎం పరిదుమస్తాన్ తెలిపారు. శనివారం ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు బాల్యవివాహాలు, గృహహింస అరికట్టడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ లింగ వివక్ష నేరమని, బాల్యవివాహాలు చేయరాదని సూచించారు. ప్రతి మహిళా విద్యావేత్తగా ఎదగాలని తెలిపారు. ప్రతి మహిళ వద్ద ప్రతిజ్ఞ చేయించారు. రక్త హీనతను వివరించారు. అనంతరం డ్వాక్రా మహిళలు మానవహారం నిర్వహించారు. సీసీ లోకనాథం, సంఘమిత్ర మురగయ్య, పాల్గొన్నారు.